

ఎప్పటికి పూర్తవుతుందో?

● ఏడేళ్లక్రితం మొదలైనా అసంపూర్తిగానే పరిశ్రమల శాఖ కార్యాలయ భవనం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖకు శాశ్వత భవన వసతి లేక అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటువారికి అద్దెలు చెల్లించలేక ఇప్పటికి రెండు భవనాలు మార్చారు. ప్రస్తుతం ఓ చిన్న భవనంలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. చిత్తూరు నగర శివారు ప్రాంతమైన ఎస్టేట్ ప్రాంతంలో జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం ఉండేది. భవనం పాతది కావడంతో దానిని పడగొట్టి నూతనంగా నిర్మించడానికి టెండర్లు పిలిచారు. 2018లో ఓ కాంట్రాక్టరు టెండర్ దక్కించుకుని భవన నిర్మాణాన్ని మొదలు పెట్టాడు. 2019లో పనులు ఆగిపోయాయి. ఆ సమయంలో డీసీసీబీ కొత్త భవనం నిర్మించుకోవడంతో దానికి సంబంధించిన పాత భవనం ఖాళీగా ఉండడంతో అక్కడికి శాఖ కార్యాలయాన్ని తాత్కాలికంగా మార్చారు. ఆ భవనానికి అద్దె, కరెంట్ బిల్లు చెల్లించేందుకు కూడా బడ్జెట్ రాకపోవడంతో దాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. తర్వాత కొంగారెడ్డిపల్లెలోని ఓ భవనంలోకి మార్చారు. అక్కడా అద్దె చెల్లించక పోవడంతో ఖాళీ చేయాలని భవన యజమాని చెప్పడంతో ప్రస్తుతం ఎస్టేట్‌లో మరో భవనంలో అద్దెకు ఉంటున్నారు. ఈ భవనం చాలా చిన్నది కావడంతో ఇరుకుగా ఉండటంతో ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత భవనాన్ని పూర్తి చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీగా ప్రొఫెసర్ తిరుపతిరావు



కుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీగా ప్రొఫెసర్ బి.తిరుపతిరావు నియమితులయ్యారు. కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన్ను సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని మేనేజ్‌మెంట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బి.తిరుపతిరావు 2006వ సంవత్సరంలో ద్రావిడ విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా వచ్చారు. ఈ యూనివర్శిటీలో ఇంగ్లిష్ డిపార్టుమెంటు హెచ్‌వోడీగా పనిచేశారు. 2016వ నుంచి 2018 వరకు ద్రావిడ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అవకాశం పొంది, అదే సమయంలో యూనివర్శిటీ ఇన్‌చార్జి ఫైనాన్స్ ఆఫీసర్‌గా పదవుల్లో కొనసాగారు. బి.తిరుపతిరావు ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా ఉంటూనే పలు పత్రికల్లో తెలుగు భాషలో వివిధ సామాజిక అంశాలపై లోతైన విశ్లేషణాత్మక వ్యాసాలు రాశారు. పలు గ్రంథాలు కూడా ప్రచురించారు.

నేడు విజయవాడకు డీఎస్సీ అభ్యర్థుల పయనం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025లో భాగంగా నియామక పత్రాలు అందుకునేందుకు అభ్యర్థులు గురువారం విజయవాడకు పయనం కానున్నారు. మెరిట్ ఆధారంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408 మంది అభ్యర్థులు ఎంపికైన విషయం తెలిసిందే. వీరికి ఈనెల 19న విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని 1408 మంది అభ్యర్థులతో పాటు సహాయకులను విజయవాడకు ప్రత్యేక బస్సుల్లో పంపేందుకు చిత్తూరు, తిరుపతి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎంపికైన అభ్యర్థులు గురువారం ఉదయం 7 గంటలకు తిరుపతి రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకోవాల్సి ఉంది. ఈ మేరకు చిత్తూరు డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రెండు బార్లకు 8 దరఖాస్తులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న బార్లకు రెండోసారి దరఖాస్తులు ఆహ్వానించారు. అందులో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఒక బార్‌కు, పలమనేరు మునిసిపాలిటీలోని మరో బార్‌కు నాలుగేసి చొప్పున మొత్తం 8 దరఖాస్తులు వచ్చాయి. గురువారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా బార్లను కేటాయిస్తారు.

గిరిజన ప్రాంతాల్లో 25 నుంచి ఇంటింటి సర్వే

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గిరిజన నివాసస్థలాల్లో రెండో విడత ఇంటింటి సర్వే ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో గిరిజనుల అభివృద్ధిపై త్వరలో తయారుచేయనున్న సమగ్ర ప్రణాళికపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25వ తేది నుంచి 22 మండలాల్లో ప్రారంభమయ్యే ఇంటింటి సర్వే ద్వారా గిరిజన కాలనీల అభివృద్ధికి జడ్పీ, ఉపాధి నిధులతో పనులు చేపట్టేవిధంగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పలు సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులందరికీ అందుతున్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు. గతంలో చిత్తూరు, గంగవరం, కార్వేటినగరం, నింద్ర, పెద్దపంజాణి, పెనుమూరు, శాంతిపురం, సోమల, విజయపురం, యాదమరి తదితర మండలాల్లో తొలివిడత సర్వే జరగ్గా, ఆధార్ కార్డు, ఎన్టీఆర్ వైద్యసేవలు, విద్యుత్ కనెక్షన్లు, వికలాంగుల, వయోవృద్ధుల పెన్షన్లు, నీటి సరఫరా, సీసీ రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు, రేషన్ కార్డులు, జనన, కుల ధ్రువీకరణ, గ్యాస్ కనెక్షన్లు, ఇళ్ళ పట్టాలు, గృహనిర్మాణ పనులపై అందిన దరఖాస్తుల్లో దాదాపు 95 శాతం పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జేసీ విద్యాధరి, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, డీపీవో ప్రభాకర్ రావు, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సదరన్ డిస్కంలో పదోన్నతులు


సురేంద్రనాయుడు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో కొంతకాలంగా కోర్టులో వున్న పదోన్నతుల సమస్య పరిష్కరమవడంతో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ సీఎండీ సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేట్ కార్యాలయంలో వున్న ఎస్ఈ సురేంద్ర నాయుడికి, జీఎం మురళీకుమార్‌కు, నెల్లూరు ఎస్ఈ ఉమాపతిలకు సీజీఎంలుగా పదోన్నతి లభించింది. అలాగే చిత్తూరు జిల్లా టెక్నికల్ ఈఈ జగదీష్‌కు ఎస్ఈగా, తిరుపతి నగర ఈఈ చంద్రశేఖర రావుకు ఎస్ఈగా పదోన్నతులు కల్పించారు. ఆర్ఏసీ విభాగంలో వున్న రాజశేఖర్ రెడ్డి, కొనుగోలు విభాగంలో వున్న సుబ్బారావులకు కూడా ఎస్ఈలుగా ప్రమోషన్ లభించింది.13 మంది డీఈలకు ఈఈలుగా పదోన్నతులు కల్పించారు.

చిత్తూరు పాత బస్టాండులో
కమర్షియల్ కాంప్లెక్స్

● రూ.30 కోట్లతో ఐదు అంతస్తుల నిర్మాణం

● కింద బస్టాండు, పై అంతస్తుల్లో కాంప్లెక్సు

● రెండేళ్లలో నిర్మాణం పూర్తికి ప్రణాళికలు

● ట్రిపుల్ పీ ప్రతినిధులతో ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ చర్చలు

చిత్తూరు పాత బస్టాండు


చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండే దశాబ్దాలుగా అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న చిత్తూరు పాత బస్టాండు రూపు రేఖలు మారనున్నాయి. త్వరలో ఇక్కడ భారీ ఎత్తున కమర్షియల్ కాంప్లెక్సును నిర్మించనున్నారు. ఎమ్మెల్యే జగన్మోహన్ చొరవ తీసుకుని సీఎం చంద్రబాబుతో మాట్లాడి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళతున్నారు.ఈ క్రమంలో బుధవారం అమరావతి నుంచి వచ్చిన పబ్లిక్, ప్రైవేటు, పార్టనర్‌షిప్(పీపీపీ) ప్రతినిధులు మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే జగన్మోహన్, కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో చర్చలు జరిపారు.

● అమలు దిశగా ఎన్నికల హామీ

చిత్తూరు నడిబొడ్డున సుమారు ఒకటిన్నర ఎకరా స్థలంలో కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రైవేటు బస్టాండు ఉంది. గతంలో ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు బస్సులన్నీ ఇక్కడి నుంచే వెళ్లేవి. నగర జనాభాతో పాటు సర్వీసుల సంఖ్య పెరగడంతో రెండు విడతల్లో కట్టమంచి చెరువు సమీపంలోకి ఆర్టీసీ, ప్రైవేటు బస్టాండులను మార్చారు. కొంత కాలం ప్రైవేటు బస్సులు ఇక్కడ ఆగినా.. చాలాకాలంగా ఈ ప్రాంతం ఖాళీగా ఉంది. ఎన్నికల సమయంలో చిత్తూరు పాత బస్టాండును అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే అమలు చేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే గెలిచిన తర్వాత అక్కడి కూరగాయల, పండ్ల మార్కెట్లను ఇతర ప్రాంతాలకు తరలించారు. ఆ ప్రాంతాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంది.దీంతో పాటు హైరోడ్డు విస్తరణ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ రెండూ పూర్తయితే చిత్తూరు నగర రూపురేఖలు మారనున్నాయి.



ట్రిపుల్ పీ ప్రతినిధులతో చర్చలు

● డిసెంబరులో అగ్రిమెంటు....

పీపీపీ విధానంలో పాత బస్టాండు ప్రాంతంలో అత్యాధునిక మల్టీప్లెక్స్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ట్రిపుల్ పీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ విశాల్ గోగన్‌కర్ బుధవారం చిత్తూరులో ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులతో సమీక్షించారు. ప్రాథమికంగా ఒకటిన్నర ఎకరా స్థలంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో బస్టాండ్‌తో పాటు పైన ఐదు అంతస్తుల వరకు కమర్షియల్ కాంప్లెక్సులను నిర్మించాలని నిర్ణయించారు. వచ్చే నెలాఖరులోగా డిజైన్, అనుమతులు పూర్తి చేసుకుని డిసెంబరులో అగ్రిమెంటు చేసుకునేలా చర్చలు జరిగాయి. ఒప్పందం చేసుకున్న రోజు నుంచి రెండేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. దీనికి మొత్తం రూ.30 కోట్ల ఖర్చు అంచనా వేస్తున్నారు.

ఏటవాకిలి కార్యదర్శి చేతివాటం

స్వామిత్వ సర్వేలో పట్టాలిప్పిస్తానంటూ వసూళ్లు



ఫోన్‌పే ద్వారా మంజుశ్రీకి పంపిన రూ.1500

పుంగనూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంటిపట్టాలు ఇప్పిస్తా..భూములపై హక్కులు మీపేరుతో తెప్పిస్తా అంటూ పుంగనూరు మండలం ఏటవాకిలి పంచాయతీ కార్యదర్శి మంజుశ్రీ వసూళ్లకు పాల్పడుతున్నారు.ఏటవాకిలి పంచాయతీలో కొద్దిరోజులుగా స్వామిత్వ సర్వే జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్ ఇంటింటికీ తిరుగుతూ కొలతలు తీస్తూ రికార్డు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, గ్రామకంఠాలు , ఖాళీస్థలాల్లో గతంలో తీసిన క్యూఆర్ కోడ్ మ్యాపింగ్ ద్వారా వివరాలు సేకరించి కొలతలు తీస్తున్నారు. సర్వే పూర్తికాగానే గ్రామానికి సంబంధించిన భూములు, ఇళ్లు, తదితర వివరాలు ప్రభుత్వానికి అధికారులు నివేదిస్తారు. ఈ నేపథ్యంలో కార్యదర్శి ఎం.మంజుశ్రీ భూములను ఆన్‌లైన్ చేసి పట్టాలు తీసిస్తానంటూ, అలాగే భర్త మృతి చెందితే భార్య పేరుతో భూముల వివరాలు మార్చేందుకు రూ.1500 చొప్పున వసూళ్లకు శ్రీకారం చుట్టారు.పొరుగు గ్రామాల్లో స్వామిత్వ సర్వే జరుగుతున్నప్పటికీ ఎక్కడా డబ్బులు వసూలు చేయడంలేదని తెలుసుకున్న ఏటవాకిలి జనం ఆందోళన చెందారు.కొందరు మాత్రం డబ్బు పోయినా విలువైన భూమికి పట్టా వస్తుందని, ఆ పట్టాను తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకోవచ్చని భావిస్తున్నారు. వసూళ్ల విషయమై పుంగనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో లీలామాధవిని, ఏవో రెడ్డెమ్మను అడగ్గా ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై గురువారం విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాణిపాక లడ్డు రూ.6.25 లక్షలు


లడ్డూను అందుకుంటున్న సుభాష్‌గుప్తా

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గుర్తుగా తయారు చేసిన 21 కేజీల మహాలడ్డూకు మంగళవారం అర్ధరాత్రి వేలం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సుభాష్‌గుప్తా రూ.6,25,000కు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో పెంచల కిషోర్, మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదన రావు, ఏఈవోలు రవీంద్రబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘తిరుచానూరు’ స్టేషనుకు నాందేడ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్


తిరుచానూరు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ప్రత్యేక రైలు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):తిరుచానూరు రైల్వే స్టేషనుకు తొలి రైలు వచ్చింది. హరత్ నాందేడ్-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఉదయం 11.40 గంటలకు రావాల్సి ఉండగా, మూడు గంటల ఆలస్యంగా మధ్యాహ్నం 3.18 గంటలకు చేరుకుంది. ఈ కొత్త స్టేషన్‌లో దిగే ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడానికి తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ముందుగానే వచ్చారు. ప్రత్యేక రైలు సమాచారం తెలుసుకున్న కొందరు ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకున్నారు. వారికి విశ్రాంతి గదుల్లో వసతులు కల్పించి.. ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. సాధారణ ప్రయాణికుల కోసం టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు.ఈ ప్రత్యేక రైలులో 170 మంది ప్రయాణికులు ప్రయాణించగా, అందరూ రేణిగుంట రైల్వే జంక్షన్‌లో దిగారు. టీటీఐలు మాత్రం తిరుచానూరు వరకు వచ్చారు. ఈ ప్రత్యేక రైలు 6.40 గంటలకు తిరిగి బయలు దేరింది. రేణిగుంట జంక్షన్ పేరు పాతది కావడంతో అందరూ అక్కడే దిగారని అధికారులు తెలిపారు. తిరిగి అక్కడే ఎక్కుతారన్నారు.

పులిచెర్లలో 100.4 మిమీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు మండలాలు మినహా 30 మండలాల్లో వర్షం దంచేసింది. అత్యధికంగా పులిచెర్లలో 100.4 మిమీ, అత్యల్పంగా రామకుప్పంలో 1.8 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా సదుంలో 96.6మిమీ,పెనుమూరులో 86.8, వెదురుకుప్పంలో 76.2, పూతలపట్టులో 60.2, సోమలలో 56.4, చౌడేపల్లిలో 52, గంగవరంలో 47.8, పలమనేరులో 40, గుడిపాలలో 32.2, పాలసముద్రంలో 30.6, పెద్దపంజాణి, యాదమరి మండలాల్లో 30.2, నింద్రలో 28.4, ఐరాలలో 25.4, రొంపిచెర్లలో 23.6, పుంగనూరులో 21.2, తవణంపల్లెలో 16.4, బంగారుపాళ్యంలో 16.2, శ్రీరంగరాజపురంలో 15.4, చిత్తూరు రూరల్‌లో 15.8, గంగాధరనెల్లూరులో 13, కుప్పంలో 11, కార్వేటినగరంలో 10.4, విజయపురంలో 10.2, చిత్తూరు అర్బన్‌లో 7, బైరెడ్డిపల్లిలో 3.2, నగరిలో 2.8, వి.కోటలో 2.2 మిమీ వర్షం కురిసింది.

15 నెలల తరువాత శవానికి పోస్టుమార్టం


పోస్టుమార్టంలో పాల్గొన్న అధికారులు

పెనుమూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):15 నెలల క్రితం హత్య చేయబడ్డ మహిళ మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం చేసిన ఘటన పెనుమూరు మండలంలో చోటుచేసుకుంది.బంగారుపాళ్యం మండలం బలిజపల్లికి చెందిన బుజ్జమ్మ 2023 డిసెంబరులో తన కుమార్తె చెంచులక్ష్మి అదృశ్యమైందంటూ ఫిర్యాదు చేయడంతో పెనుమూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లిలో ఉన్న ఓ మామిడి తోపులో పనిచేస్తున్న దేవేంద్ర డబ్బుల విషయమై అక్కడే పని చేస్తున్న చెంచులక్ష్మితో గొడవపడ్డాడు. మద్యం మత్తులో మామిడి తోపులోనే ఉన్న కుంటలో చెంచులక్ష్మిని ముంచి పక్కనే పూడ్చి పెట్టాడు.పోలీసుల విచారణలో ఈ విషయాన్ని నిందితుడు అంగీకరించడంతో బుధవారం సీఐ నిత్యబాబు, ఎస్ఐ వెంకటనరసింహం తదితరులు మామిడితోపు వద్దకు చేరుకున్నారు.డాక్టర్ల సమక్షంలో చెంచులక్ష్మి అస్థిపంజరాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.

భార్యపై హత్యాయత్నం

కత్తితో నరికి ఆత్మహత్యకు భర్త ప్రయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న కీర్తన

కుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో దారుణం చోటు చేసుకుంది. ఒక భర్త తన భార్యను కత్తితో నరికి హత్య చేయడానికి ప్రయత్నించాడు. తర్వాత తాను ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించాడు. స్థానికుల కథనం మేరకు..బైరప్ప కొట్టాలు గ్రామానికి చెందిన కీర్తనకు తమిళనాడు రాష్ట్రం వేపనపల్లె సమీపంలోని తీర్థం గ్రామానికి చెందిన రాజేష్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. ప్రసవంకోసం కొంతకాలం క్రితం పుట్టింటికి వచ్చిన కీర్తన మగబిడ్డకు జన్మనిచ్చింది. భార్యాబిడ్డలను చూడడానికి బుధవారం అత్తవారింటికి రాజేష్ వచ్చాడు. ఇద్దరిమధ్యా ఏమి జరిగిందో కానీ కీర్తనపై మొచ్చు కత్తితో రాజేష్ కిరాతకంగా దాడి చేశాడు. కీర్తన అరుపులు విని అక్కడికి చేసురుకున్న స్థానికులు కేకలు వేయడంతో అత్తింటి నుంచి రాజేష్ పరారయ్యాడు. సమీపంలోని ఓ ఇంటి పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించాడు. స్థానికులు అతడిని పట్టుకుని చెట్టుకు కట్టేశారు. తీవ్రంగా గాయపడ్డ కీర్తనను హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. కుప్పం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూనియర్ కాలేజీలోకి వర్షపునీళ్లు

రాజకాలువల ఆక్రమణతోనే అన్న ప్రిన్సిపాల్


కాలేజీ ముందు వర్షపునీరు

చౌడేపల్లె, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి):చౌడేపల్లె జూనియర్ కళాశాల మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువును తలపించింది.కాలేజీలో తరగతి గదులతో పాటు కార్యాలయంలోనూ అడుగు లోతు మేర వర్షపు నీరు నిలిచింది. దీంతో విద్యార్థులు ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకుని తమ కాలేజీ పరిస్థితిపై నిరసన తెలియజేశారు. తహసీల్దార్ పార్వతికి, ఏవో షబ్బీర్‌అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలేజి ప్రిన్స్‌పాల్ జయప్రకాష్ మాట్లాడుతూ..వర్షపు నీరు వెళ్లేందుకు ఉన్న రాజ కాలువలు ఆక్రమణకు గురికావడం, పూడిపోవడం, కాలేజీ చుట్టు పక్క పొలాల వాళ్ళు మట్టితోలి ఎత్తు లేపడం, వర్షపు నీరు పోవటానికి దారి లేకుండా ప్రహరీ నిర్మించడం తదితర కారణాలతో వర్షపు నీరు కాలేజీలోకి వచ్చాయన్నారు. కొన్ని ఎలక్ట్రిక్ పరికరాలు, రికార్డులు, పుస్తకాలు నీటిలో తడిచిపోయినట్లు తెలిపారు. అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. తహసీల్దార్ పార్వతి సంఘటనా స్థలాన్ని పరిశీలించి తాత్కాలికంగా ఎక్స్‌కవేటరుతో కాలువలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని వెలుపలకు పంపాలని సూచించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి, రాజకాలువల ఆక్రమణపై సర్వే చేయాలని ఆదేశించారు.


కాలేజీ ఆవరణలో అడుగు లోతు నీరు


వాసంశెట్టి శుభాష్


రవళి, ఆర్కే రోజా


జ్యోతి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మంత్రి వాసంశెట్టి శుభాష్, మాజీ మంత్రి ఆర్కే రోజా, సినీ నటులు రవళి, జ్యోతి ఉన్నారు.

త్వరలో 'వాయుపుత్ర'

● దర్శకుడు చందూ మొండేటి వెల్లడి

తిరుమల, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): సితార బ్యానర్‌లో త్వరలో 'వాయుపుత్ర' అనే కొత్త సినిమా షూటింగ్ మొదలవుతుందని దర్శకుడు చందూ మొండేటి వెల్లడించారు. కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతి సినిమాకు విడుదల ముందు, తర్వాత తిరుమలకు వస్తుంటామన్నారు. 'కార్తికేయ-2' ఓపెనింగ్ కూడా ఇక్కడే జరిగిందన్నారు. అలాగే 'తండేల్' విజయం తర్వాత కూడా చిత్ర బృందంతో వచ్చి స్వామిని దర్శించుకున్నట్టు చెప్పారు.



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తుతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.87 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,607

తలనీలాలు సమర్పించినవారు: 23,856



ఆండవన్ ఆశ్రమాధిపతికి టీటీడీ పెద్ద మర్యాద



తిరుమల, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ ఆశ్రామాధిపతి వరాహమహాదేశికన్ టీటీడీ పెద్ద మర్యాదతో బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద టీటీడీ అధికారులు, అర్చక బృందం పల్లకీలో తీసుకెళ్లిన శతగోపాన్ని వారికి సమర్పించారు. అక్కడ నుంచి మంగళవాయిద్యాల నడుమ మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లి మూలవిరాట్టును దర్శించుకున్నారు.

ఆ మృతుల వెనుక ఆర్థిక వివాదాలు?

● సెల్‌ఫోన్ డాటా విశ్లేషణ, పోస్టుమార్టం నివేదికలే కీలకం


ఆనవాళ్లు సేకరిస్తున్న సీఐ సుదర్శన ప్రసాద్

పాకాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాకాలవారిపల్లె సమీపంలోని బయటపడిన మృతదేహాల కేసులో ఆర్థికాంశం కీలకంగా మారింది. ఆదివారం రెండు మృతదేహాలు, తర్వాత గోతుల్లో మరో ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా కనిపించిన విషయం తెలిసిందే. మృతులది తమిళనాడుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. తమిళనాడు పోలీసులతో వెంకటేష్ అనే వ్యక్తి వచ్చి మృతురాలు జయమాలను తన భార్యగా, దర్శిని, వర్షిణిలను కుమార్తెలుగా గుర్తించారు. మృతుడు కళైసెల్వన్ దగ్గర బంధువని పోలీసులకు చెప్పాడు. కాగా కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య ఆర్థిక విషయంలో గొడవలున్నట్లు తెలిసింది. కువైట్ నుంచి తిరిగి వచ్చిన వెంకటేష్ బంధువు కళైసెల్వన్‌పై చీటింగ్ కేసు పెట్టినట్లు సమాచారం. ఈక్రమంలో జూలైలో భార్యాపిల్లలు కనిపించడంలేదని తిట్టచ్చేరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాడు. మృతదేహాల వివరాలు తెలిసినా జయమాల కుటుంబసభ్యులెవరూ సంఘటనా స్థలానికి రాలేదు. కళైసెల్వన్‌కు చెందినవారు కూడా రాలేదు. జయమాల భర్త, మామ, బావలు మాత్రమే తమిళనాడు పోలీసులతో వచ్చారు. మృతదేహాల వద్ద రెండు సెల్‌ఫోన్లు దొరికాయి. చిన్నపాప మృతదేహం తలపై గాయాలున్నాయి. పోస్టుమార్టం రిపోర్టు, సెల్‌ఫోన్ల విశ్లేషణ వివరాలు వస్తే హత్యా లేదా ఆత్మహత్య అనేది తెలిసే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

సుబ్రమణ్యంనాయుడికి కన్నీటి వీడ్కోలు

● అంతిమయాత్రలో పాడె మోసిన ఎమ్మెల్యే నాని


సుబ్రమణ్యంనాయుడి అంతిమయాత్రకు తరలివచ్చిన జనం



పాడె మోస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం గడ్డంవారిపల్లెలో బుధవారం డీసీఎంస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడికి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. శోకతప్త హృదయాలతో నివాళులర్పించారు. మధ్యాహ్నం జరిగిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా పాడె మోశారు. ఎమ్మెల్యే సతీమణి సుధారెడ్డి, కుమారుడు పులివర్తి వినీల్ దివంగత నేత కుటుంబ సభ్యులను ఓదారుస్తూ అండగా నిలిచారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్‌నాయుడు, మబ్బు దేవనారాయణరెడ్డి, జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు చేరుకుని సుబ్రమణ్యంనాయుడి పార్థివదేహానికి పూలమాలలు వేశారు. మధ్యాహ్నం ఆయన పార్థివదేహంపై టీడీపీ జెండాను కప్పారు. తర్వాత అంతిమయాత్ర సాగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పార్టీకి నిబద్ధతతో సేవలందించిన సుబ్రహ్మణ్యంనాయుడి మృతి పార్టీకి, తనకు తీరని లోటు అన్నారు. వైసీపీ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నివాళులు అర్పించిన వారిలో వైసీపీ నేతలు మల్లం చంద్రమౌళి రెడ్డి, షేక్ మస్తాన్, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, పాకాల చరణ్ రెడ్డి, అగరాల భాస్కర్ రెడ్డిలు ఉన్నారు.

మామండూరు బాధితులకు ఊరట

● 22ఏ నుంచి విముక్తి కల్పించిన ప్రభుత్వం

● చొరవ తీసుకున్న తుడా చైర్మన్


తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌ను సత్కరిస్తున్న మామండూరు బాధితులు

తిరుపతి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మామండూరు తుడా లేఅవుట్ బాధితులకు శుభవార్త. రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత వైసీపీ ప్రభుత్వంలో చంద్రగిరి మండలం మామండూరులో సుమారు పన్నెండెకరాల్లో 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్' పేరిట 139 ప్లాట్లతో తుడా ఎంఐజీ లేఅవుట్ వేసింది. అప్పటికి ఈభూములు 22ఏ (నిషేధిత జాబితా)లో ఉన్న విషయం దాచిపెట్టింది. ప్లాట్లు విక్రయించేసింది. తర్వాత రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో కొనుగోలుదారులు అవాక్కయ్యారు. అంతేకాదు లేఔట్ స్థలానికి మ్యాపింగ్‌కి మధ్య వ్యత్యాసం ఉండడంతో వీరు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తుడా కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి తమ సమస్యను మొరపెట్టుకున్నారు. ఆయన స్పందించి చొరవ తీసుకున్నారు. వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేష్, నారాయణల దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా ఇక్కడి కొనుగోలుదారులకు 22ఏ నుంచి విముక్తి కల్పించారు. రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేశారు.


పదిరోజుల్లో రిజిస్ట్రేషన్ చేస్తాం

మామండూరు బాధితులకు పది రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేస్తామని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, వీసీ శుభం బన్సల్‌లు తెలిపారు. బుధవారం తుడా కార్యాలయంలో ప్లాట్ల కొనుగోలుదారులతో వారు సమావేశం నిర్వహించారు. తమ సమస్య పరిష్కరించి పెద్ద ఊరటనిచ్చిన చైర్మన్‌ను ఈ సందర్భంగా బాధితులు ఘనంగా సత్కరించారు.

మదినిండా.. మారుతి జెండా

● ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు ముస్తాబవుతున్న గూడూరు


రూపుదిద్దుకుంటున్న ఆంజనేయస్వామి జెండా


గూడూరులో ఆంజనేయస్వామి జెండా గ్రామోత్సవం (ఫైల్ ఫొటో)

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దసరా అనగానే మైసూరు తరువాత గుర్తుకు వచ్చేది గూడూరు. నవరాత్రులకు ఒక రోజు ముందుగానే ఇక్కడ జరిగే జెండా ఉత్సవాలు మరీ ప్రత్యేకం. విజయదశమి ముందు వచ్చే అమావాస్య నాడు జరిగే ఈ వేడుకను పట్టణ ప్రజలు వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈసారి కూడా ఈనెల 21వ తేదీ రాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు జోరందుకున్నాయి.

ఇదీ జెండా వేడుక నేపథ్యం

గూడూరు ఏర్పడిన తొలినాళ్లలో అరిష్టాలు ప్రబలి వ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రజలు భావించారు. ఆంజనేయస్వామిని పూజిస్తే కష్టాలు కడతేరుతాయని విశ్వసించారు. ఈక్రమంలోనే 77 ఏళ్ల క్రితం తొలిసారిగా బొడ్డుచౌక పాంతంలోని శక్తిరాయి వద్ద ఆంజనేయస్వామి జెండాను ప్రతిష్ఠించినట్లు చెబుతారు. జెండాకు ఆరు గజాల తెల్లని వస్త్రం వాడారు. దీనిపై సంజీవని పర్వతం తీసుకుని భూమిపై దిగుతున్న భంగిమలో అంజనీపుత్రుడి చిత్రాన్ని వేశారు. ఈజెండాను ఎనిమిది అడుగుల వెదురుకర్రకు అమర్చి విజయదశమి ముందు వచ్చిన అమావాస్యనాడు సాయంసంధ్యవేళ గ్రామోత్సవం నిర్వహించారు. ఈపూజల ఫలితంగా పట్టణంలో వ్యాధులు తగ్గుముఖం పట్టాయని జనం నమ్మి ఏటా అదేరోజుల ఆంజనేయస్వామి జెండా పండుగను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

వీధివీధినా పోటాపోటీగా..


ప్రస్తుతం పట్టణ వీధులలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌దీపాలంకరణ


కోనేటిమిట్టలో విద్యుద్దీపాలంకరణ (ఫైల్ ఫొటో)

పట్టణం విస్తరించింది. అదేతరహాలో పలు ప్రాంతాల్లో ఆంజనేయస్వామి జెండాలను ప్రతిష్ఠించడం మొదలైంది. ఇప్పుడు 40కి పైగా జెండాలేర్పడిన ఇక్కడ వీధుల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాలానుగుణంగా ఈ పతాకాన్ని రంగురంగులతో ఆకర్షణీయంగా తయారుచేస్తున్నారు. సంజీవని పర్వతాన్ని మోసుకువస్తున్న ఆంజనేయస్వామి చిత్రపటాన్ని ట్రాక్టరుపై ఘనంగా ఊరేగిస్తారు. మేళతాళాలు,సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పోటాపోటీగా ఈ వేడుక జరుగుతోంది ఊరేగింపు ముందు తెనాలిబ్యాండు, బేతాళ, కాంతార నృత్యాలు, జింగిరి మేళం, తప్పెట్లు, తాళాలు, కోలాటాలు, కేరళ బ్యాండు, తీన్‌మార్, బొట్టబొమ్మల అభినయం, పార్వతీమహిషాసురల యుద్ధనాట్యాలు, ఆకర్షణగా నిలుస్తాయి.జెండా ఉత్సవాలు ముగిసన మర్నాడు (ఈనెల 22న) నుంచి శరన్నవరాత్రుల నిర్వహణకు శ్రీకారం చుడతారు.ఈక్రమంలోనే జెండా పండగకు పట్టణ ప్రజలు సిద్ధమవుతున్నారు.

అరెస్టుకోసం భూమనకు ఉబలాటమెందుకు?

● తండ్రిని జైలుకు పంపేందుకు తనయుడి కుతూహలం ● చేసిన పాపాలకు శిక్ష తప్పదన్న కూటమి నేతలు



తిరుపతి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైసీపీ నేతలైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాదిరిగానే అరెస్ట్ అయిపోయి వారి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెప్పు పొందేందుకు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఉబలాటపడుతున్నారు. తన తండ్రిని అరెస్టు చేయించేందుకు కుమారుడు అభినయ్ కూడా కుతూహలంగా ఉన్నారు. సానుభూతి కోసం నాటకాలు ఆడినంత మాత్రాన భూమన కుటుంబాన్ని ప్రజలు నమ్మే పరిస్థితులు లేవు' అని యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ జి.నర్సింహ యాదవ్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ఏపీయూఐడీసీ డైరెక్టర్ ఊకా విజయ్ కుమార్, గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వీరు మీడియాతో మాట్లాడారు. భూమన కుటుంబం అరెస్టు అవ్వాలని ఉద్దేశపూర్వకంగానే సోషల్ మీడియాలో రాద్ధాంతం చేశారన్నారు. శనీశ్వరుడి విగ్రహం వద్దకెళ్లి మహావిష్ణువు విగ్రహానికి అపచారం జరిగిందని, తిరుమల ప్రతిష్ఠతను దెబ్బతీస్తున్నారన్నారు. కాగా, శనీశ్వరుడి విగ్రహం వద్ద మంగళవారం జరిగిన విషయంపై ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే తన తండ్రిని అక్రమంగా అరెస్టు చేసేస్తున్నారంటూ అభినయ్‌రెడ్డి చేసిన ప్రచారం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల్లో సానుభూతి పొందేందుకు పోస్టర్లు సిద్ధం చేయడం విపరీత పోకడలకు నిదర్శమన్నారు. తండ్రిని అరెస్టు చేయించేందుకు కుమారుడికి ఎందుకు అంత తొందరో తెలియడం లేదన్నారు. ఇదంతా కూడా జగన్‌రెడ్డి మన్ననలు పొందేందుకే అని విశదీకరించారు. కాగా, మంగళవారం సాయంత్రం ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. గతంలో మీరు చేసిన అక్రమాలు, అన్యాయాలపై విజిలెన్స్ విచారణ పూర్తయిందని, వీటిపై చట్టపరంగా భూమనపై చర్యలుంటాయన్నారు. భక్తుల కానుకలు, టీటీడీ నిధులను కాజేసిన చేసిన మిమ్మల్ని ఎందుకు వదిలిపెట్టాలని ప్రశ్నించారు. తిరుపతిలో అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ఘనత భూమన కుటుంబానిదన్నారు. తిరుమలలో నెయ్యి కల్తీకి పాల్పడటం, రూ600 కోట్లతో పనులకు టెండర్లు పిలిచి నచ్చినవారికిచ్చి కమీషన్లు తీసుకోవడం, స్మార్టు సిటీ నిధులు, టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. అంతేకానీ అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, అన్నింటికీ లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు.

ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయండి

● లండన్‌లో మంత్రి లోకేశ్‌కు పిచ్చాటూరు యువత విజ్ఞప్తి


మంత్రి లోకేశ్‌తో సోమపల్లి నందు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది విశాఖ కేంద్రంగా నవంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు తరలిరావాలని మంత్రి లోకేశ్ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికేందుకు లండన్‌లోని పాల్‌మాల్ కన్వెన్షన్ వేదికగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - యూకే బిజినెస్ ఫోరం రోడ్ షో నిర్వహించాయి. టెక్ మహీంద్ర యూరప్ బిజినెస్ హెడ్ హర్షుల్ అస్నానీ అనుసంధానకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో పిచ్చాటూరు సింగిల్‌విండో చైర్మన్ జయచంద్రనాయుడు తనయుడు సోమపల్లి నందు మాట్లాడారు. బంగారు గ్రామం నుంచి ఎన్‌హెచ్ 716బి చిత్తూరు- తచ్చూరు రోడ్డు అనుబంధంగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ పార్కు అభివృద్ధితో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్లు నందు తెలిపారు. అనంతరం ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలను వివరించానని పేర్కొన్నారు. ఈ రోడ్ షోలో యూకే డిప్యూటీ హైకమిషనర్ సుజిత్ ఘోష్, ఐసీఐసీఐ బ్యాంక్ యూకే సీఈవో రాఘవ్ సింఘాల్, ఏపీఐఐసీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ అభిషిక్త్ కిశోర్, గ్లోబల్ ఫండ్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్ కంపెనీల ప్రతినిధులు, గంధమనేని కామేష్ తదితరులు పాల్గొన్నారు.

లా విద్యార్థి ఆత్మహత్య


మృతిచెందిన ఆరోగ్య స్టీఫన్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): న్యాయ విద్య చదువుతున్న విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారికి చెందిన మరియా వియ్యప్పన్ కుమారుడు ఆరోగ్య స్టీఫన్(28) తిరుపతిలోని ప్రైవేటు లా కళాశాలలో నాలుగో సంవత్సరం లా విద్య చదువుతున్నాడు. చెడు స్నేహాల కారణంగా మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. మానసిక ఒత్తిడితో తరచూ తాను చనిపోతున్నానంటూ తల్లిదండ్రులకు మెసేజ్‌లు పెట్టేవాడు. 10 రోజుల క్రితం సోదరుడికి ఇదే రకమైన మెసేజ్ పెట్టాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతని ఫోన్ లిఫ్ట్ చేయడం, మెసేజ్‌లను పట్టించుకోవడం మానేశారు. మంగళవారం సాయంత్రం హాస్టల్ భవనంలోని ఐదో అంతస్తులో కూర్చుని మద్యం తాగడం తోటి విద్యార్థులు గమనించారు. తెల్లవారుజామున హాస్టల్ భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వార్డెన్ సమాచారం మేరకు ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మహబూబ్ బాషా ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థులను విచారించారు. మద్యానికి బానిసకావడం, తల్లిదండ్రులు దూరం పెట్టడంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని విద్యార్థులు చెప్పారు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్లకు 22 నెలల జైలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడిన నలుగురు స్మగ్లర్లకు 22 నెలల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బుధవారం తీర్పు చెప్పారు. రాయచోటి డివిజన్ పరిధిలోని ఫారెస్టు లైజన్ అధికారి అనిల్‌కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు.. కేవీ పల్లె మండలం నూతన కాలువకు చెందిన ఎస్. రమణయ్య, ఎర్రిమల్లయ్య, శివ మల్లయ్య, ఎర్రావారిపాలెం మండలం ఉస్తికాయలపెంటకు చెందిన బి.మల్లికార్జున 2012లో సానిపాయి రేంజ్, దిన్నెల బీట్‌లో దాదాపు 31 ఎర్రచందనం దుంగలు అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్నారు. దీనిపై అందిన సమాచారంతో అప్పటి ఫారెస్టు బీట్ అధికారి సత్యనారాయణ, సిబ్బంది తనిఖీలు చేశారు. ఆ నలుగురు స్మగ్లర్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. దీనిపై రాయచోటిలోని రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు విచారించిన తర్వాత ఈ కేసును తిరుపతికి బదిలీ చేశారు. ఏపీపీ శాంతి వాదనలు వినిపించగా, ఫారెస్టు లైజన్ అధికారి అనిల్‌కుమార్ సాక్ష్యాధారాలను కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత నలుగురు స్మగ్లర్లకు 22 నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీకాంత్ తీర్పు చెప్పారు.

● మోదీ జన్మదినం సందర్భంగా

75 మంది నేతల రక్తదానం


రక్తదానం చేస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా బుధవారం తిరుపతిలోని బీజేపీ కార్యాలయంలో 75 మంది నేతలు రక్తదానం చేశారు. స్విమ్స్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 2వ తేదీ వరకు అనేక సేవా కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తెలిపారు. రెండు వారాల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు కోరారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, నాయకులు జల్లి మధుసూదన్, మునికృష్ణయ్య, నరేష్, బాలాజీ పాల్గొన్నారు.

ఫేక్ పోస్టులతో మనోభావాలు దెబ్బతీయొద్దు

● ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ



తిరుపతి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా ఎదగాలనుకునే మహిళలను టార్గెట్ చేస్తూ కొందరు సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులతో మనోభావాలు దెబ్బతీయొద్దని ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ కోరారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఫేక్ న్యూస్‌లు పెట్టి మనోభావాలు దెబ్బ తీసే పన్నాగాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. జాతీయ మహిళా సాధికారత సదస్సులో తీర్మానానికి భిన్నంగా కొందరు మహిళలు రాజకీయంగా ఎదుగుతుంటే కించపరుస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. 2019లో వైసీపీ హవాలో కూడా తాను ఓడిపోలేదని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా కుట్రలు చేసి ఓడించారని పలుసార్లు చెప్పానన్నారు. కరుణాకర్‌రెడ్డికి పార్టీని తాకట్టు పెట్టానని తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరామన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, చినబాబు, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, కోడూరు బాలసుబ్రమణ్యం, డీజే కృష్ణ యాదవ్, పుష్పావతి, మన్యం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, బీజీ ఆనంద్ యాదవ్, విశ్వనాథం, రజనీకాంత్ నాయుడు, అనిత, హేమావతి, రజిని, కల్పన, జయంతి తదితరులు పాల్గొన్నారు.

పూడి వద్ద రిసార్టుల నిర్మాణం

● పులికాట్ తీరంలో పెట్టుబడులకు క్లబ్ మహీంద్ర ఆసక్తి

తడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ముందడుగు పడుతోంది. పులికాట్ తీర ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. తడ మండలం పూడి వద్ద పర్యాటకులను ఆకర్షించేలా రిసార్ట్‌ల నిర్మాణం చేపట్టేందుకు క్లబ్ మహీంద్ర సంస్థ ముందుకొచ్చింది. పూడి గ్రామ సర్వే నెంబరు 111లో సుమారు 20 ఎకరాల్లో రిసార్ట్‌లను నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో రెవెన్యూ అధికారులు క్లబ్ మహీంద్రకు భూములు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందంతో క్లబ్ మహీంద్ర ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. వన్యప్రాణి విభాగం అధికారుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో త్వరలోనే రిసార్ట్‌ల నిర్మాణం చేపట్టే అవకాశం ఉందని, పర్యాటక రంగ అభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద తదితరులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉన్నట్లేనని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే దేశం ఆరోగ్యంగా ఉన్నట్టేననే ఉద్దేశంతో ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. స్టేట్ నోడల్ అధికారి సునీల్ నాయక్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి అక్టోబరు 2వ తేది వరకు జరిగే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ముఖ్యంగా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 50 పీహెచ్‌సీల్లో, 15 యూపీహెచ్‌సీల్లో, 437 విలేజ్ క్లినిక్‌ల్లో, 5 సీహెచ్‌సీ, 3 ఏరియా, 2 స్పెషలిస్ట్ క్యాన్స్ ద్వారా 538 వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్, అభా ఐడీ నమోదు, పీఎంజేఏవై, పీఎంఎంవీవైల పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో సుధారాణి మాట్లాడుతూ బుధవారం జిల్లావ్యాప్తంగా 46 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో, 6 పీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం గర్భిణులకు అందించే పౌష్టికాహారం ప్రదర్శనను ఏర్పాటు చేసి, గర్భిణులకు ఎమ్మెల్యే, అధికారులు కలిసి పౌష్టికాహారాన్ని అందించారు. మేయర్ అముద, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి, ఆస్పత్రి ఎంఎస్ ఉషశ్రీ, ఏఎంసీ చైర్మన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళామార్టు
అవకతవకల లెక్క తేల్చరా?



పెనుమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన నిత్యావసరాలు విక్రయించే లక్ష్యంతో ప్రారంభించిన మహిళా మార్టు చివరకు అవినీతి ఊబిలో కూరుకుపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022వ సంవత్సరం డ్వాక్రా సంఘాల నేతృత్వంలో పెనుమూరులో చేయూత మహిళామార్టు పేరుతో ఇది ప్రారంభమైంది. డ్వాక్రా మహిళలంతా రూ.300 చొప్పున 9600మంది సుమారు రూ.30 లక్షలు కట్టగా, సీఐఎఫ్ నుంచి రూ.25 లక్షలు, బీఎంసీయూ నుంచి రూ.7.50 లక్షలు సేకరించి మార్టు ప్రారంభించారు. రెండేళ్లపాటు ఒక్కో మహిళ నెలకు వెయ్యి రూపాయలకు సరుకులు కొనాలని నిబంధన పెట్టి రూ.4 కోట్లకు సరుకుల అమ్మకాలు జరిపారు.2022-24నడుమ రెండేళ్లలో సుమారు రూ.4కోట్ల వ్యాపారం సాగించి రాష్ట్రంలోనే ఉత్తమ మార్టుగా గుర్తింపు పొందింది.ఆర్థిక అవకతవకలు నడిచినప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చేదాకా బయటపడలేదు. కొత్త ప్రభుత్వం రాగానే మార్టు నిర్వాహకులు సొంత ఆడిట్ చేసి మండల సమాఖ్య సమావేశం పెట్టి మార్టు రూ.5లక్షల నష్టాల్లో వుందని ప్రకటించారు. దీంతో మండల సమాఖ్యలో కొంతమంది నిలదీశారు.డ్వాక్రా సంఘ సభ్యుల చేత నెలనెలా వెయ్యి రూపాయలకు సరుకులు కొనుగోలు చేయించిన మీరు ఇప్పుడు నష్టాల్లో వుందంటే ఎలా నమ్మాలని ఏపీఎం హరికృష్ణా రెడ్డిని ప్రశ్నించారు.సరైన సమాధానం రాకపోవడంతో ఎమ్మెల్యే థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆడిట్‌కు ఆదేశించడంతో సుమారు రెండు నెలలు ఆడిట్ చేసి రిపోర్టు ఇచ్చారు.అందులో బిల్లులు లేనివి, అసంపూర్తి టాయిలెట్‌కు రూ.3 లక్షలు ఖర్చు వంటి ప్రధాన అంశాలపై కలెక్టర్ మార్టు నిర్వాహకులను పిలిచి ప్రశ్నించగా ఒక్కరు కూడా నోరు మెదపలేదు. దీంతో వారికి షోకాజ్ ఇచ్చి నెల రోజుల్లో వివరణ కోరారు. నెల తరువాత వారు ఇచ్చిన వివరణ సక్రమంగా లేకపోవడంతో ఏపీఎం హరికృష్ణా రెడ్డిని, సీసీ యుగంధర్‌ను సస్పెండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులైన అకౌంటెంట్, ముగ్గురు ఆఫీస్ బేరర్లను తొలగించి సొమ్ము రికవరీకి కలెక్టర్ రెండు నెలల క్రితం డీఆర్డీఏ పీడీ శ్రీదేవిని ఆదేశించారు.అయితే ఇప్పటిదాకా పక్కదారి పట్టిన సొమ్ము రికవరీ జరగలేదు. మరో పక్క డ్వాక్రా మహిళలు మార్టుకు తాము కట్టిన డబ్బులు ఏమయ్యాయంటూ పలు మార్లు ధర్నాలు కూడా చేశారు. వారికి సమాధానం చెప్పాల్సిన కొందరు సంఘమిత్రలు మార్టు డబ్బులడిగితే మీరు ఇబ్బందులు పడతారంటూ భయపెట్టి ఆ సమస్యను తొక్కిపెట్టారు.మార్టులో తొలగించిన వారి స్థానాల్లో ఏపీఎం, మండల సమాఖ్య సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి కొత్తవారిని నియమించుకున్నారు. అయితే కొత్తగా చేరిన వారికి పాత అకౌంటెంట్, ఏపీఎం ఫోన్ చేసి భవిష్యత్తులో వచ్చేది తమ ప్రభుత్వమేనని, అప్పుడు మర్యాదగా మీరే వదిలి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద - స్థానికులకు మొక్కలు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్ నాయుడు తదితరులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రజాసేవలో భాగస్వాములు కావడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సేవాకార్యక్రమాలు చేపట్టాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ శ్రేణులు బుధవారం నగరంలోని పలు చోట్ల సేవా పక్షోత్సవాలు నిర్వహించారు. స్థానిక 29వ డివిజన్ పరిధిలోని తపోవనం పాఠశాలలో బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర మేయర్ అముదతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. విద్యార్థులకు అల్పాహారం అందజేసి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోస్టు కార్డుల ద్వారా విద్యార్థులు మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇందు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, పాండియన్, బ్రహ్మానందరెడ్డి, ఉదయ్‌కుమార్, శ్రీనివాసన్, సత్యభామ, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● 37వ డివిజన్‌లో బీజేపీ సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో స్థానికులకు వెయ్యి మొక్కలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తల్లిపేరుపై మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోకుల్ యాదవ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక ఐటీఐ వద్ద బీజేపీ సీనియర్ నాయకులు గుత్తా ప్రభాకర్‌నాయుడు, జయకుమార్, బాబుప్రసాద్‌రెడ్డి, కేఎం కుమార్, రామమూర్తి, వెంకటేష్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మొక్కలు నాటారు.

దళితుల విభజనతోనే సమైక్యాంధ్రప్రదేశ్ ముక్కలు
● మాజీ ఎంపీ చింతామోహన్



మాట్లాడుతున్న చింతామోహన్

కుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులు రెండుగా విడిపోవడంతో సమైక్యాంధ్రప్రదేశ్ రెండు ముక్కలైందని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. కుప్పంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయమంటూ మాలమాదిగలను విభజించడం సరికాదన్నారు. కావాలంటే మూడేళ్లపాటు ముఖ్యమంత్రి పదవి మాదిగలకు ఇవ్వొచ్చని.. తాను కూడా సంతోషించి పూలమాలతో సత్కరిస్తానని వ్యాఖ్యానించారు. మాలమాదిగల మధ్య రాజకీయ ప్రయోజనాల కోసం చిచ్చుపెట్టడం భావ్యం కాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా ఆయనకు చింతామోహన్ శుభాకాంక్షలు తెలిపారు. అద్వానిని, మురళీ మనోహర్ జోషి ఇద్దరినీ 75 ఏళ్ల పూర్తయ్యాయని పక్కన పెట్టేశారని, మరి మోదీ సంగతేమిటని బీజేపీని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే యూరియా కొరత రాష్ట్రాలను పీడిస్తోందని.. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని తప్పుపట్టారు. బ్యాంకుల నుంచి రుణాలను తెచ్చి ఆ 17 మెడికల్ కాలేజీలను పూర్తి చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో సాధించిన ప్రగతి ఏంటో చెప్పాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు షమీవుల్లా, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

ఎఫ్ఎస్‌వో సుకుమార్‌కు పరామర్శ


సుకుమార్‌ను పరామర్శిస్తున్న చైతన్యకుమార్‌రెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలో ఈనెల 13వ తేదీన ఉదయం ఒంటరి ఏనుగు దాడిలో గాయపడి తిరుపతి నారాయణాద్రిలో చికిత్స పొందుతున్న ఎఫ్ఎస్‌వో సుకుమార్‌ను బుధవారం డీసీఎఫ్, సీసీఎఫ్ కార్యాలయ ప్రత్యేకాధికారి చైతన్యకుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొన్నారు. అక్కడి నుంచి పలమనేరుకు చేరుకుని సుకుమార్‌పై ఒంటరి ఏనుగు దాడిచేసిన ప్రదేశాన్ని సందర్శించారు. దాడి వివరాలు అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలమనేరు సమీపంలోని ఎలిఫెంట్ క్యాంపును సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏనుగులను కట్టడి చేసే విషయంలోను, కుంకీ ఏనుగుల వద్ద అటవీశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు చైతన్యకుమార్‌రెడ్డిని అటవీశాఖ సీసీఎఫ్ చలపతిరావు కేసు పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిగా నియమించారని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఆయనతో పాటు పలమనేరు సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో నారాయణ, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలకు గొడుగులు
● ఊరేగింపు ప్రారంభించిన గవర్నర్


తిరుపతి గొడుగుల ఊరేగింపు

చెన్నై, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల కోసం చెన్నై నుంచి గొడుగులు బయలుదేరాయి. తిరుక్కుడై సేవా సమితి ట్రస్టు, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఫ్లవర్ బజార్ నుంచి గొడుగులు తిరుమలకు కదిలాయి. గవర్నర్ ఆర్ఎన్ రవి ఈ ఊరేగింపును ప్రారంభించారు. 21 గొడుగులతో చెన్నకేశవపెరుమాళ్ ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య కదిలిన ఈ ఊరేగింపు ఎన్ఎస్సీ బోస్ రోడ్డు, వాల్‌టాక్స్ రోడ్డు, చూళై హైరోడ్డు, అవధాన పాపయ్య రోడ్డు, వడమలైపిళ్లై వీధి, చెల్లప్ప వీధి, కున్నూరు హైరోడ్డు, అయనావరం అంబత్తూరు, ఆవడి, తిరువళ్లూరు, పుత్తూరు మీదుగా ఈనెల 21 ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుమల చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

కృత్రిమ కాలుకు నమోదు చేసుకోండి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు కృత్రిమ కాలు(ఆర్టిఫిషియల్ లింబ్స్) అవసరమైన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయకులు వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. కృత్రిమ కాలు అవసరమైన వారు 99892 06667, 90000 10390 నెంబర్లకు ఫోన్‌చేసి నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్లూరులో ఆగని గజదాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి 16 ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి పంటలను ధ్వంసం చేసుకుంటూ చిత్తూరు-కర్నూలు హైవేను దాటుకొని తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని దాటుకున్నాయి. మంగళవారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు కల్లూరు సమీపంలోని రిలయన్స్ టవర్ వద్దకు చేరుకున్నాయి. కల్లూరులోని పీరయ్య, షాజహాన్, మౌలానా అహమ్మద్‌కు చెందిన మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి చిత్తూరు-కర్నూలు హైవేను దాటుకొని తూర్పు విభాగం అటవీ ప్రాంతం సరిహద్దులోని పాళెం పంచాయతీలోకి చేరుకున్నాయి. కోటపల్లిలోని గోపి, రామచంద్రయ్య, వెంకట్రమణ, నరసింహులు, సుబ్రహ్మణ్యం, కల్లూరు సయ్యద్ బాషా, జూపల్లి రత్నకర్‌నాయుడుకు చెందిన మామిడి, వరిపంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కోటపల్లి మీదుగా తూర్పు విభాగం అడవిలోకి చేరుకున్నాయి. బుధవారం పగలంతా చింతలవంక ప్రాంతంలో ఏనుగుల గుంపు తిష్ఠ వేసినట్లు ప్రజలు తెలిపారు. పాళెం, దేవళంపేట, కమ్మపల్లి పంచాయతీ సరిహద్దులో ఏనుగుల గుంపు సంచరిస్తున్నాయని, కోటపల్లి, జూపల్లి, పాళెం, దేవళంపేట, కమ్మపల్లి, దేశిరెడ్డిగారిపల్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



వాల్మీకిపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభి రామాలయంలో బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో విశేష పూజలు జరిగాయి. మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో తీర్చిన కల్యాణ వేదికపై సీతారాములను ఆశీనులు చేసి మంగళ వాయిద్యాల ఘోష, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. అనంతరం వేడుకలలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎస్వీ శిల్పకళాశాలలో విశ్వకర్మ జయంతి


ఎస్వీ శిల్పకళాశాలలో విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి వేడుకలను అలిపిరి మార్గంలోని శిల్ప కళాశాలలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న ఆయన విగ్రహాన్ని అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు మునిరత్నం, పి.విశ్వరూపాచారి, కె.మహేశ్వర్, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఎం.ప్రసాద్ కుమార్, పి.బ్రహ్మయ్య, కె.వేణు, ఉదయ్‌చంద్రకుమార్, నాగరాజు, గణేష్, సురేష్, శేషగోపాల్ పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు



తిరుపతి, (మంగళం) సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేవీ బావి అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ మహేశ్వరనాయుడు బృందం స్థానిక ఎఫ్‌బీవో నాగేశ్వరనాయక్‌తో కలసి కోడూరు పరిధిలోని కేవీ బావి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున నొక్కోడి గుండం వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. చుట్టుముట్టి ఇద్దరిని పట్టుకోగలిగారు. మిగిలిన వారు తప్పించుకున్నారు. 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు తమిళనాడు వాసులుగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

రామకుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతులకు వివిధ పంటలు, తోటల పెంపకానికి విరివిగా ప్రోత్సాహకాలను అందిస్తోందని రామకుప్పం మండల ఉద్యాన అధికారి డింపుప్రియ ఓ ప్రకటనలో తెలిపారు. మామిడి, దానిమ్మ తోటల విస్తరణకు 2 హెక్టార్ల వరకు రూ.50 వేలు, జామతోటకు రూ.80 వేలు, చీనీ, దానిమ్మకు రూ.50 వేలు, కోకో, సపోటా, సీతాఫలం తోటలకు రూ.30 వేలు, టిష్యూకల్చర్ అరటికి రూ.70 వేలు, బొప్పాయికి రూ.30 వేలు, డ్రాగన్‌ఫ్రూట్ తోటసాగు, సపోర్టు సిస్టమ్‌కు రూ.2.70 లక్షలు, అవకాడో, అత్తికాయలకు రూ.50 వేలు, ప్యాషన్‌ఫ్రూట్ తోటసాగు, సపోర్టు సిస్టమ్‌కు రూ.1.10 లక్షలు, ఉసిరి, కలోండ, నేరేడు, చింత, పనస, సీతాఫలం తోటల సాగుకు రూ.30 వేలు, పూలతోటలకు రూ.20 వేలు, హైబ్రిడ్ కూరగాయల సాగుకు రూ.24 వేలు, మష్రూమ్ ప్రొడక్షన్ యూనిట్‌కు రూ.12 లక్షలు, కంపోస్టు మేకింగ్ యూనిట్‌కు రూ.12 లక్షలు, మామిడితోటల పునరుద్ధరణకు రూ.24వేలు ప్రోత్సాహక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కమ్యూనిటీ నీటి కుంటల ఏర్పాటుకు రూ.18 లక్షలు, నీటి కుంటల ఏర్పాటుకు రూ.75 వేలు, పాలీహౌస్‌ల నిర్మాణానికి కొలతలను బట్టి రూ.50 లక్షలు, రూ.50.25 లక్షలు, షెడ్‌నెట్‌కు రూ.3.50 లక్షలు, మల్చింగ్‌కు రూ.20 వేలు, ప్యాక్‌హౌస్‌కు రూ.2.40 లక్షలు, ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.12.25 లక్షలు, రిపెనింగ్ చాంబర్‌కు రూ.35 వేలు ప్రోత్సాహక సాయం అందిస్తోందన్నారు. అలాగే మినీ ట్రాక్టరుకు రూ.1.60 లక్షలు నుంచి రూ.2 లక్షలు, పవర్‌టిల్లర్లకు రూ.80 వేలు నుంచి రూ.1.20 లక్షలు, తైవాన్ స్ప్రేయర్లకు రూ.8 వేలు నుంచి రూ.10 వేలు, ట్రాక్టర్ స్ప్రేయర్లకు రూ.33 వేలు నుంచి రూ.41 వేలు, ట్రెల్లీ్‌ఎకు రూ.33 వేలు నుంచి రూ.41 వేలు, శాశ్వత పందిరి ఏర్పాటుకు రూ.2.5 లక్షల ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తోందని ఆమె వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు సంబంధిత రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

యువకుడిని బలి తీసుకున్న లోన్ యాప్

రూ.5 వేలకే ప్రాణాలు పోగొట్టుకున్న వైనం


ముబారక్ (ఫైల్)

పీలేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లోను యాప్ నిర్వాహకుల వేధింపులను భరించలేక పాతికేళ్ల ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పీలేరులో వెలుగు చూసింది. వ్యాపార అవసరాల నిమిత్తం చేసిన అప్పు సకాలంలో తీర్చలేకపోవడంతో ఆ యాప్ నిర్వాహకులు పంపిన అసభ్యకర మెసేజ్‌ల కారణంగా అతను బలవన్మరణానికి పాల్పడ్డాడు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కథనం మేరకు పీలేరు పట్టణం కట్టుకాలువ వీధికి చెందిన ఎస్.ముబారక్ (25) స్థానిక కడప రోడ్డులో చికెన్ షాపు నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యాపార అవసరాల నిమిత్తం ఆన్‌లైన్‌లో ఆకర్షణీయమైన ప్రకటనలతో ఆకట్టుకున్న ఓ లోను యాప్‌లో రూ.5 వేలు అప్పు తీసుకున్నాడు. ఎటువంటి పత్రాలు అవసరం లేకపోవడం, త్వరగా రుణం అందుతుందన్న ఆశతో కేవలం ఏడు రోజుల వ్యవధిలో రూ.5 వేలకు వడ్డీ రూపంలో మరో రూ.4,850 చెల్లించేటట్లు ఒప్పందం చేసుకున్నాడు. ఇటీవల వ్యాపారాలు తగ్గిపోవడంతో సకాలంలో చెల్లించలేకపోయాడు. అప్పు వసూళ్ల ప్రక్రియలో భాగంగా ఆ యాప్ నిర్వాహకులు మంగళవారం మధ్యాహ్నం అతడి భార్య, సోదరుడు, మరికొంత మంది బంధువులకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపారు. ఆ మెసేజ్‌ల కారణంగా వారి కుటుంబంలో అలజడి రేగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ముబారక్ మంగళవారం మధ్యాహ్నం తన షాపులోనే పురుగుల మందు తాగాడు. దానిని గుర్తించిన సహచరులు ఈ విషయాన్ని అతని కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు వదిలాడు. చేసేది లేక వారు అతని మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎస్ఐతో కార్మికులకు ప్రయోజనాలు


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ సంస్థతో కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఈఎస్ఐ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ఏపీఎస్.ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం తిరుపతి కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంవో, కమిషనర్‌లు మాట్లాడుతూ ఈఎస్ఐ సంస్థ కార్మికుల కోసం వైద్యం అందించడమే కాక, అనారోగ్య సమయంలో సెలవులకు నగదు, గర్భిణులకు జీతంతో కూడిన సెలవులు, పని సమయాల్లో ప్రమాదం జరిగితే నగదు ప్రయోజనం లాంటి ఎన్నో ప్రయోజనాలు అందిస్తోందని చెప్పారు. ఈఎస్ఐ లబ్ధిదారులు వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో ఈఎస్ఐ లబ్ధిదారులకు రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేశారు. వైద్యులు డాక్టర్ కె.బాలాజీ, డాక్టర్ పీఎస్.చందన, డాక్టర్ నాగేంద్ర, ఆయుష్ వైద్యురాలు శ్రీలత, స్థానిక ప్యానల్ డాక్టర్ రాజా రమేశ్, హెడ్ నర్సులు పి.సరస్వతి, విజయనిర్మల, కన్సల్టెన్సీ ప్రతినిధి ఎంవీ.విజయ కుమార్, వైద్య సిబ్బంది పి.హేమలత, దివ్యభారతి, విజయన్, రామాంజులు, నరసింహులు, ఇందిర తదితరులు వైద్య సేవలు అందించారు.

పాడిరైతులకు అండగా ప్రభుత్వం


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులకు అన్నివిధాలా అండగా నిలుస్తోందని టీడీపీ కెంచనబల్ల యూనిట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచి సత్తి తెలిపారు. బుధవారం కెంచనబల్ల పంచాయతీ పరిధి భూమండలపురంలో వారు ఆర్ఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 53 ఆవులకు గాలికుంటు వ్యాధి మందులు వేశారు. పలు పశువులకు వివిధ రోగాలకు సంబంధించి చికిత్సలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు గుణశేఖర్, నేతలు రామాంజులు, నరేంద్ర, ఆర్ఎస్‌కే వెటర్నరీ అసిస్టెంట్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

అడ్డగట్టుతాండాలో పైపులైన్ల పనులకు చర్యలు


పైపులైను ఏర్పాటు పనులకు భూమి పూజ

రామకుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పెద్దతాండా పంచాయతీ అడ్డగట్టుతాండాలో ఎట్టకేలకు తాగునీటి సరఫరా మెరుగపడనుంది. గ్రామంలోని దశాబ్దాల క్రితం రక్షిత మంచినీటి పథకం బోరులో గత కొన్నేళ్లుగా జలాలు తగ్గిపోయాయి. దీంతో గ్రామంలోని అన్ని కుటుంబాలకు నీరందని పరిస్థితి. ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు తాగునీటి సమస్యపై పలుసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. చంద్రబాబు సీఎం కావడంతో గ్రామస్తులు, పంచాయతీ టీడీపీ పెద్దలు సమస్యను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరు గ్రామానికి అదనపు బోరు మంజూరు చేశారు. ఇటీవల బోరు తవ్వకం చేశారు. బుధవారం ఆ బోరు నుంచి పైపులైను తవ్వకం పనులను ఏఎంసీ డైరెక్టర్ మునేంద్రనాయక్, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు సైరాజ్‌నాయక్ భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు గౌడానాయక్, రాజ్‌కుమార్ నాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సమస్య పరిష్కారానికి చర్యలు


సోలార్ హ్యాంగింగ్ పనులు ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి తదితరులు

రామకుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పొలాలు, తోటలపై ఏనుగుల దాడుల నిరోధానికి అన్ని చర్యలు చేపడుతోందని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్ విండో చైర్మన్ మహ్మద్‌రఫీ తెలిపారు. బుధవారం రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లె గేట్ నుంచి కావలిమడుగు, పీఎంకేతాండా మీదుగా పీఎంతాండా వరకు ఏర్పాటు చేయనున్న సోలార్ హ్యాంగింగ్ ఫెన్సింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏనుగుల దాడుల నిరోధంపై సీఎం, డీసీఎంలు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు భూపతి, నేతలు గుర్రప్ప, శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజన్న, మురుగేష్, మునిరాజనాయక్, మురళీ, సుబ్రహ్మణ్యం, అటవీ విభాగాధికారి హరికుమార్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు వైద్య నిర్ధారణ పరీక్షలు


శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేశ్‌బాబు

కుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 220 మంది విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు శిబిరానికి హాజరయ్యారు. వారికి వైద్య నిర్ధారణ పరీక్షలు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వెంకటరమణ, ఎంఈవో-2 రాజారాం, ఐఈ కో ఆర్డినేటర్ మధు, నాలుగు మండలాల ఎంఈవోలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

కుప్పం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ కుప్పం మండలాధ్యక్షుడు, ఏపీ ఐబీసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని చెక్కునత్తం సచివాలయం అధికారులు, పంచాయతీ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. అధికారులతో నాయకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ అధికారులు, పంచాయతీ సమన్వయ కమిటీ సభ్యుల వివరాలతో కూడిన బోర్డును సచివాలయంలో ప్రదర్శించారు.

పరిశ్రమల స్థాపనకు ఉదయం రిజిస్ట్రేషన్లు


ఉదయం రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిశ్రమల శాఖ అధ్వర్యంలో బుధవారం పలమనేరు మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా పరిధిలోని మహిళా సంఘ మహిళలకు ఉదయం రిజిస్ట్రేషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు చిన్నచిన్న పరిశ్రమలు నిర్వహిస్తున్న వారు, కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొనేవారు, ఉన్న పరిశ్రమలను విస్తరించుకునేవారు ఉదయం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీఐసీ జనరల్ మేనేజర్ సూరిబాబు ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఐపీవో రామాంజనేయ రెడ్డి, సచివాలయ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు.. నవసమాజ నిర్మాతలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని టీడీపీ రామకుప్పం మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. బుధవారం రామకుప్పంలో ఉపాధ్యాయ దినోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులో ప్రధానంగా మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల కొరత తీరేలా చూస్తోందన్నారు. సమావేశానంతరం మండలం నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎంఈవో నారాయణప్ప, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, నేతలు గుర్రప్ప, చంద్రబాబునాయక్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.

పారిశ్రామిక కేంద్రంగా పొగురుపల్లె అభివృద్ధికి కృషి


బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న పీఎస్ మునిరత్నం, ఆర్డీవో శ్రీనివాసరాజు

గుడుపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొగురుపల్లెను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం పొగరుపల్లె పంచాయతీ కార్యాలయం ఆవరణలో పారిశ్రామిక కేంద్రానికి భూములు అందిం చిన రైతులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఆర్డీవో శ్రీనివాసరాజు మాట్లాడుతూ భూములు అందించిన రైతులకు నాలుగు రెట్ల పరిహారం అందించినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే సత్వరమే పరిష్కరిస్తానని చెప్పారు. టీడీపీ మండలాధ్యక్షులు బాబు నాయుడు, సింగిల్ విండో చైర్మన్ రమేష్, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ అరుణాచలం, జనసేన మండలాధ్యక్షులు డాక్టర్ వెంకటేష్, రెస్కో డైరెక్టర్ అమీర్, రెస్కో డైరెక్టర్ బాలు, నేతలు గోవిందస్వామి, గోవిందు, సురేష్, బాలాజీ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అంతంతమాత్రంగా ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యులు దామోదర్‌రాజు

చౌడేపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో వైద్యం అంతంతమాత్రంగా అందుతోందని.. వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, అత్యవసరం సమయాల్లో 108 వాహనం అందుబాటులో లేదని వైస్ఎంపీపీ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ రామ్మూర్తి అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దామోదర్ రాజు మాట్లాడుతూ మాట్లాడుతూ అన్నదాతకు కావాల్సినంత యూరియా సరఫరా చేయాలని.. రైతుకు ఒక బస్తా యూరియా ఇస్తే ఎక్కడ సరిపోతుందన్నారు. సకాలంలో రైతులకు యూరియా సరఫరా చేస్తేనే ఉపయోగమన్నారు. తహసీల్దార్ పార్వతి మాట్లాడుతూ స్మార్ట్ రేషన్‌కార్డులు 85 శాతం పంపిణీ చేశామన్నారు. గృహనిర్మాణశాఖ ఏఈ మణి మాట్లాడుతూ నూతనంగా ఇళ్ల కోసం ధరఖాస్తు చేసుకుంటే అర్హులకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ మోనా మాట్లాడుతూ 108 వాహనం మరమ్మతులకు గురైందని విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని తెలిపారు. ఏపీఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి డ్వాక్రా గ్రూప్ సభ్యులకు రాయితీతో సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఏవో సబ్బీర్‌హలీ, ఎంఈవో కేశవరెడ్డి, ఏఈ శశికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయొద్దు

● డీఎస్పీ పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

కుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు లోనై తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయొద్దని కుప్పం డీఎస్పీ పార్థసారథి విద్యార్థులకు హితవు పలికారు. కుప్పంలోని జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో విద్యా సంస్థలకు పంపి చదువు చెప్పిస్తారన్నారు. వారి ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో, శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. అయితే కొంతమంది విద్యార్థులు పక్కదారులు పట్టి డ్రగ్స్ వంటి వ్యసనాలకు లోనవుతున్నారన్నారు. మత్తు పదార్థాలు వాడటం, విక్రయించడం, వేరేవారిని అందుకు ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ నేరాలకు చట్టపరమైన శిక్ష తప్పదని హెచ్చరించారు. విద్యార్థులను ర్యాగింగ్ చేయడం నేరమని హెచ్చరించారు. విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా పదిమందికి ఉపయోగపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుప్పం అర్బన్ సీఐ వి.శంకరయ్య, కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, బాలాజీ నాయక్, ఇమ్మాన్యుయేల్, మాణిక్యం, హుసేన్, పీడీ ఇన్‌చార్జి బి.ప్రవీణ్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ సూచించారు. బుధవారం పలమనేరులోని వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, వైద్యాధికారిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాజ్మా, మాధవీలత, లత, కల్పన, పుష్ప, గీతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో రాజేశ్వరీదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-3లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాల నివారణకు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.


చౌడేపల్లెలో అంగన్‌వాడీల ర్యాలీ

భాష్యం పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి


ఎమ్మార్వో ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు భాష్యం స్కూల్‌లో టీచర్ సలీంబాషా విద్యార్థిని సాత్విక నాగశ్రీ తలపై కొట్టిన ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని భాష్యం పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎమ్మార్వో ఎదుట విద్యార్థి సంఘ నాయకులు విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీమాంధ్ర విద్యార్థి సంక్షేమ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్సీ సురేశ్, ఏబీవీపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వై.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినిపై టీచరు దాడి చట్టవిరుద్ధమైన చర్య అని.. పాఠశాల గుర్తింపు రద్దు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిసాగర్, వినయ్‌కుమార్, రెడ్డిప్రసాద్, ప్రకాశ్, శివకుమార్, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనకు గుర్తింపు


మోహన్‌బాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సోమల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ బోధనలతో విద్యార్థులను ఆకట్టుకున్న టీచర్లు బదిలీపై వెళ్లడంతో వారిని సన్మానించడం అభినందనీయమని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జీసీకే ప్రసాద్ అన్నారు. బుధవారం కలమందలవారిపల్లెలో విధులు నిర్వహిస్తూ పత్రపల్లె పాఠశాలకు బదిలీపై వెళ్లిన మోహన్‌బాబును గ్రామస్తులు, విద్యార్థులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం. భాస్కర్, టీచర్లు గాయత్రి, ఎస్వీ రమణ, రమణయ్య, సరళమ్మ, చంద్ర, జయప్రకాశ్, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ


దాతను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు

గంగవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్రాజుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు దాతలు రూ.1.62 లక్షల విలువైన ఫర్నీచర్‌ను బుధవారం వితరణ చేశారు. చిత్తూరు జోస్ లుక్కాస్ సంస్థ వారు ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలకు అవసరమైన డెస్కులు, చైర్స్ వాటర్ డ్రమ్స్‌తో పాటు పలు సామగ్రిని అందజేశారు. ఫర్నీచర్‌ను వితరణ చేసిన దాతలను సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ భాస్కర్, పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, విద్యాకమిటీ చైర్మన్ గోపినాధ్ తదితరులు సన్మానించి అభినందనలు తెలిపారు.

బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా చంద్రశేఖర్‌రెడ్డి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా వీరమనాయనిపల్లెలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై బైరెడ్డిపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను ప్రస్తుత ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఏవో ఆనంద్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, ఎమ్మార్వో సురేష్‌బాబు తదితరులు సన్మానించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న రాజేంద్రబాలాజీ పలమనేరుకు బదిలీ అయ్యారు.

20 మందిపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కట్టకిందపాళ్యం రాములవారిగుడి వద్ద మంగళవారం రాత్రి కారు డ్రైవర్‌పై దాడి చేసిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. స్థానిక కుమ్మరవీధిలో ఆదివారం వినాయక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా కట్టకిందపాళ్యం వారు డ్యాన్స్ వేస్తుండగా గొడవ జరిగిందన్నారు. తర్వాత ఇరు వీధుల వారు గొడవలు పడగా నరేంద్ర అనే వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌లో బైండవర్ చేసి పంపగా కారుడ్రైవర్ రవిచంద్ర కుమారుడు ఎన్.నరేంద్రపై బుజ్జి, పవన్, సంతోష్, గని, అరుణ్, సోము, మోహన్, సూర్యలతోపాటు 20 మంది దాడిచేసి గాయపరచడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మోదీ నాయకత్వంలో అగ్రరాజ్యంగా భారత్


కుప్పంలో మోదీ జన్మదినం జరుపుకుంటున్న తులసీనాథ్ తదితరులు


పలమనేరులోని టవర్‌క్లాక్ వద్ద మోదీ జన్మదిన వేడుకలు


రక్తదాన శిబిరంలో పాల్గొన్న కూటమినాయకులు

కుప్పం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశ ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా ఎదుగుతోందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రెస్కో డైరెక్టర్ ఎన్ఎస్.తులసీనాథ్ అన్నారు. కుప్పంలో మోదీ 75వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కుప్పం ఇంజనీరింగు కళాశాల కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కుప్పం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కుప్పం ప్రభుత్వాస్పత్రి డైరెక్టర్ కాశీనాథ్, ఏఎంసీ డైరెక్టర్ వడివేలు, బీజేపీ నాయకులు ఆంజనేయప్ప, రాణి, జనార్ధన్‌రెడ్డి, బి.నాగరాజు, బి.కుమార్, ఇతర నాయకులు కన్నన్, బాబు, కుప్పం ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ విజయకుమారి, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరులో బుధవారం ప్రధాని నరేంద్రమోడి జన్మదినవేడుకలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకొన్నారు.ఈ సందర్భంగా టవర్‌క్లాక్ వద్ద నరేంద్రమోడి భారీ ప్లెక్సీని ఏర్పాటుచేశారు. అటుపిమ్మట బీజేపీ జిందాబాద్,నరేంద్రమోడీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.అటుపిమ్మట పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు శరవణకుమార్, వంశీ, జగన్, శక్తిప్రసాద్, తవడపల్లి బాలాజీ, ఎం.సీ.రెడ్డి, తాతయ్యనాయుడు, రామక్రిష్ణారెడ్డి, సీనియర్ నాయకులు రామన్న, శ్రీరాములయ్య, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** మోదీ జన్మదిన వేడుకలను పుంగనూరులో ఎన్డీఏ కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో బీజేపీ శ్రేణులు రెడ్‌క్రాస్ ద్వారా రక్తదాన కార్యక్రమాన్ని సీఐ సుబ్బరాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగదీశ్‌రాజు, రాజారెడ్డి, విజయ్, కుమార్, మల్లిఖారాణి, టీడీపీ నాయకులు సీవీరెడ్డి, మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సోమల, చౌడేపల్లె, కల్లూరు, బైరెడ్డిపల్లెల్లోనూ మోదీ జన్మదిన వేడుకలు జరిగాయి.

విశ్వబ్రాహ్మణులు నైపుణ్యాలను పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాయని, వాటిని ఉపయోగించుకోవడంలో భాగంగా కాలానుగుణంగా నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. బుధవారం స్థానిక జడ్పీ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు అత్యుత్తమ శిల్పకళా నైపుణ్యంతో కర్ర, ఇనుము, బంగారం వంటి వస్తువుల రూపకల్పనలో దశాబ్దాలుగా తమ వృత్తిని కొనసాగిస్తున్నారన్నారు. జేసీ విద్యాధరి మాట్లాడుతూ ప్రపంచానికి సృష్టికర్త, శిల్పకళా నిపుణుడు, వాస్తు శాస్త్ర పితామహుడిగా గౌరవించే విశ్వకర్మ మహర్షి మనందరికీ మార్గదర్శకులన్నారు. బీసీ సంక్షేమశాఖ, బీసీ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ, నగర మేయర్ అముద, బీసీ కార్పొరేషన్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లాస్థాయి నాయకులు పాల్గొన్నారు.

● చిత్తూరు కల్చరల్(ఆంధ్రజ్యోతి): స్థానిక కార్పెంటర్స్ అసోసియేషన్ సంఘ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరై విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాల వేసి, పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం సభ్యులు పార్వతి, అశోక్ కుమార్, కేజీ మురళి, కోదండాచారి, కుమరేష్, మజా అలీబాయ్, రాజేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

● చిత్తూరు అర్బన్(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతిని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్, ఆర్ఐ సుధాకర్, ఏవో నాగభూషణమ్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మసత్ర నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న నాగేశ్వర చౌదరి

ఐరాల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నూతనంగా నిర్మిస్తున్న కమ్మసత్ర నిర్మాణానికి బుధవారం వద్దిపట్లపల్లెకు చెందిన నాగేశ్వర చౌదరి, బుజ్జి దంపతులు రూ.1,00,116 విరాళంగా అందించారు. ఆయన మాట్లాడుతూ కమ్మసత్రం నిర్మించడానికి నిర్వాహకులు కృషి చేస్తున్నారన్నారు. అన్నిదానాలకన్నా అన్నదానం చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో భార్గవ్ చౌదరి, ప్రణీత్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలను నిర్మిద్దాం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా చెత్త రహిత గ్రామాలను నిర్మిద్దామని డీపీవో సుధాకర్‌రావు అన్నారు. బుధవారం కాణిపాక పంచాయతీ కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్లకు ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చెత్తను సేకరించే కార్మికులు పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు తడి,పొడి చెత్తను విడివిడిగా వేసే విధంగా చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ కోఆర్డినేటర్ డీపీఆర్సీ హరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి డిల్లీబాబు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌కు కలిసి రావాలి

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని నెహ్రూయువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మై భారత్ ఆధ్వర్యంలో సపోర్టు స్వచ్ఛంద సంస్థ సమావేశ మందిరంలో వికాస్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌వైకే ప్రాంతీయ గణంకాధికారి ఎంసీ బాబురెడ్డి మాట్లాడుతూ భారత్ వికసిద్భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. అనంతరం స్వచ్ఛత సేవాలో భాగంగా సపోర్టు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సపోర్టు అధ్యక్షుడు జోసెఫ్ రాజ్, రెడ్డప్ప, వాలంటీర్లు, యువత పాల్గొన్నారు.

బాల్యదశలోనే పోషకాహారం పెట్టాలి

● ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాల్యదశ నుంచే చిన్నారులకు పోషకాహారం పెట్టాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో పోషణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో ఊబకాయాన్ని తగ్గించడం ఆరోగ్యానికి అన్నివిధాలా మంచిదన్నారు. పిల్లల సంరక్షణ బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదే అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో నిర్మల, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, టీడీపీ మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, కూటమి నాయకులు గుంటూరు మురళి, ప్రసాద్, లావణ్య, మంజుల, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలయ్యేలా చూడండి



వైద్యాధికారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

గుడిపాల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలయ్యే విధంగా చూడాలని డీఎంహెచ్‌వో సుధారాణి అన్నారు. బుధవారం మండలంలోని గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గ్రామీణ స్థాయిలో ప్రజలకు తెలియజేసి చైతన్యపర్చాలన్నారు. అనంతరం కాన్పుల గదిని పరిశీలించి, కాన్పుల సంఖ్యను పెంచి రోగులతో స్నేహభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. తమ విధులను సక్రమంగా నిర్వహించి రోగులకు మెరుగైనా వైద్య సేవలు అందించాలన్నారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు అనూష, బాలసూర్యనారాయణ, వైద్యాధికారులు సంధ్య, ప్రవీణ, చంద్రమ్మ, పవిత్ర పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా



సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్నం భోజన విరామంలో సర్కిల్ కార్యాలయం ఎదుట జనరేటింగ్ స్టేషన్ ముందు ఉద్యోగుల జేఏసీ నాయకులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే ధర్నా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు క్రిష్ణయ్య, దేవేంద్ర, వివేకానందరెడ్డి, చంద్రశేఖర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ అంతరాయం

చిత్తూరురూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం నుంచి ఈ నెల 21వతేది వరకు చిత్తూరు నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బజారువీధి, ఓటీకే రోడ్డు, పరిసర ప్రాంతం, తిమ్మసముద్రం, ఇందిరానగర్, కైలాసపురం, సంతపేట, సీబీ రోడ్డు, చవటపల్లి, గాంధీ రోడ్డు, ఎల్ఐసీ కాలనీలో అప్పుడప్పుడు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని ఆయన పేర్కొన్నారు.

వాహనాల వేలంతో రూ.లక్షా 51 వేల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న సీఐ, తహశీల్దార్

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాల వేలం ద్వారా రూ.లక్షా 51 వేలు ఆదాయం వచ్చినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 12 ద్విచక్రవాహనాలకు బహిరంగ వేలం నిర్వహించగా, రూ.లక్షా 51 వేలు ఆదాయం వచ్చిందన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



బావిలో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

గుడిపాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీబీ పల్లె సమీపంలోని ఓ బావిలో టూవీలర్‌లో జారి పడి మృతిచెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బొమ్మసముద్రం దళితవాడకు చెందిన రాజేష్ (35) మంగళవారం తన పనులను ముగించుకుని ఇంటికి వెళుతుండగా మార్గమధ్యమైన డీబీపల్లె సమీపంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డారు. బుధవారం తెల్లవారు జామున స్థానికులు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. స్థానికుల ఫిర్యాదుతో ఎస్ఐ రామ్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని బావిలో గాలింపు చర్యలు చేపట్టారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన మునస్వామి కుమార్తె మైథిలి(21)కి ఎస్ఆర్ పురం మండలం పద్మాపురం గ్రామానికి చెందిన వెంకటేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. మంగళవారం ఇందిరానగర్‌కు వచ్చిన మైథిలి సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో తండ్రి మునస్వామి బంగారుపాళ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

25లోపు ఈకేవైసీ చేసుకోండి

బంగారుపాళ్యం,సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న 13,853 మంది ఈ నెల 25వ తేదీలోపు ఈకేవైసీ చేసుకోవాలని డ్వామా అడిషనల్ పీడీ మల్లికార్జున అన్నారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన గోకుల్ షెడ్లను వేగవంతం చేయాలని, పేమెంట్స్ త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో అక్షరాంధ్రను నిర్వహించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో దినకర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఎస్ఎస్ పైలట్ ప్రాజెక్టుగా పెనుమూరును ఎంపిక చేయండి

పెనుమూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలాన్ని విద్యుత్ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలంటూ సీఎండీకి మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు వినతిపత్రం సమర్పించారు. వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండాలన్నా, నిరంతర విద్యుత్ సేవల కోసం పైలట్ ప్రాజెక్టుగా మండలాన్ని ఎంపిక చేయాలని ఆయన కోరారు. జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ సహకారంతో మండల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

ఎస్ఆర్‌పురం ఎంపీడీవోగా వనజ

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం నూతన ఎంపీడీవోగా వనజ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె నారాయణవనం మండల ఏవోగా పనిచేస్తు పదోన్నతిపై ఎస్ఆర్‌పురం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయ ఏవో మోహన మురళి, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోను శాలువతో సన్మానించారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

యాదమరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణంలో బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఉన్న ఎరువుల స్టాక్, రికార్డులు, బిల్లులను అధికారులు పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి తేడాలు లేకపోవడంతో, దుకాణం నిబంధనల ప్రకారం నడుస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి రామాంజుల రెడ్డి, వ్యవసాయ అధికారిణి దీప పాల్గొన్నారు.

డీఎఫ్‌వో భరణికి సత్కారం



డీఎఫ్‌వో భరణిని సత్కరిస్తున్న అమర్‌నాథ నాయుడు

యాదమరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళుతున్న చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) భరణిని జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు బుధవారం అటవీశాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. డీఎఫ్‌వో భరణి చిత్తూరు జిల్లాలో అడవుల పెంపకం, అటవీ సంరక్షణకు ఎంతో కృషి చేశారని కొనియాడారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

నింద్ర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని కేవీకే మైదానంలో విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం ఈ పోటీలను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల క్రీడా కమిటీ కన్వీనర్ మణి, పీడీ సురేష్‌ల నేతృత్వంలో పోటీలు నిర్వహించారు.హెచ్‌ఎం శ్యామలాదేవి, కేవీకే నిర్వాహకులు బాబు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడి

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడి వస్తుందని నగరి ఏడీ కవిత అన్నారు. బుధవారం ఎస్ఆర్‌పురం గ్రామంలో సుభాష్ పాలేకర్ పద్ధతిలో పృథ్వీ మిత్ర రైతు సేవ సంఘం సభ్యులు గోపాల్ నాయుడు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ఆమె పరిశీలించారు. కాలాబట్టి, దేశీయవరి రకం నల్లబియ్యం వరి పంటను ఆమె పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి కుసుమ, సుకన్య, రైతులు గోపాల్ నాయుడు, బాలక్రిష్ణ నాయుడు, మహేష్, ప్రేమ్ చంద్, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల హాజరు శాతాన్ని పెంచండి

గుడిపాల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచే విధంగా చూడాలని డిప్యూటీ డీఈవో ఇందిర అన్నారు. బుధవారం మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు.

వర్షానికి పొంగిపొర్లుతున్న వాగులు

● కల్వర్టు నిర్మించాలని గ్రామస్తుల నిరసన



వడ్డికండ్రిగ వద్ద పొంగిపొర్లుతున్న వాగు, సమీపంలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఎగువకమ్మకండ్రిగ, మిట్టకండ్రిగ, వడ్డికండ్రిగ, డీకే కండ్రిగ గ్రామాలకు వచ్చిపోయేందుకు అంతరాయం ఏర్పడింది. వాగుని దాటడానికి వీలు కాకపోవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు వాగు సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఆ గ్రామానికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడ కల్వర్టు నిర్మాణం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు.

జోరుగా పారుతున్న గార్గేయనది



ఐరాలలో పారుతున్న గార్గేయనది

ఐరాల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గార్గేయ నది పొంగి పొర్లుతోంది. బుధవారం వేకువ జాము నుంచి వంక ఉధృతి పెరగడంతో ఉదయం తహసీల్దార్ కార్యాలయం వద్ద వంతెన దాటడానికి ప్రజలు ఇబ్బందిపడ్డారు. అలాగే గొల్లపల్లెకు వెళ్లే దారివద్ద ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో వంక ఉధృతి తగ్గడంతో ప్రజలు వంకను దాటారు.

చిత్తూరును అందంగా తీర్చిదిద్దుదాం

● ఎమ్మెల్యే జగన్మోహన్



స్వచ్ఛతాహీ ర్యాలీని ప్రారంభిస్తున్న పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్, తదితరులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు, యువత, నాయకులంతా కలిసి చిత్తూరును అందంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ - 2025లో భాగంగా బుధవారం చిత్తూరులో మేయర్ అముదతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతాహీ కార్యక్రమాల్లో భాగంగా అక్టోబరు 2వ తేది వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబులు స్వచ్ఛతా గ్రామాలు, పట్టణాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, ఏసీపీ నాగేంద్ర, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ జన్మదిన వేడుకలు బుధవారం పూతలపట్టులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే మురళీమోహన్ కేక్ కట్‌చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు గాజుల బాస్కర్, సోమశేఖర్ నాయుడు, శంకర్ నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, కిరణ్, హేమాద్రి, ఏకాంబరం, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నింద్ర: నగరి పట్టణ పరిధిలోని బీజేపీ నాయకులు బుధవారం టవర్‌క్లాక్ సెంటర్ నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన కార్యక్రమం నిర్వహించి 60 యూనిట్ల రక్తదానం చేశారు. ఆస్పత్రిలో గర్భిణులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు, రాష్ట్ర సభ్యులు వేలాయుధం, రామమూర్తి యాదవ్, మునికృష్ణ నాయుడు, మండల అధ్యక్షులు హరి, రాము, బాల ప్రసాద్‌రెడ్డి, ప్రదీప్ కుమార్, మోహన్, కాంచన, మీర, జలదక్ష తదితరులు పాల్గొన్నారు.



విజయపురంలో పండ్లు పంచుతున్న రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి

● విజయపురం: విజయపురంలో బీజేపీ నాయకులు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచి సంబరాలు చేశారు. విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి పంచారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, మండల బీజేపీ అధ్యక్షుడు రాము, బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, మణిరెడ్డి పాల్గొన్నారు.



ప్రధాని మోదీకి పాలాభిషేకం

● వెదురుకుప్పం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం వెదురుకుప్పంలో బీజేపీ, టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, వాణిజ్య విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, బీజేపీ మండల అధ్యక్షుడు బోడిరెడ్డి అశోక్‌రెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లూరు సుధాకర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా వెదురుకుప్పంలో వావిలిచేను గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు తాతిరెడ్డి సుధాకర్‌రెడ్డి వితరణతో అన్నదానం చేశారు. అంతకు ముందుగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తర్వాత బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డితో కలసి పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, వరప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు వాటర్ ప్యూరిఫైయర్లు



నింద్ర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ కరకంతాపురంలో గల బీసీ హాస్టల్‌కు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ రెండు వాటర్ ప్యూరిఫైయర్ ఫిల్టర్లను అందజేశారు. వీటిని బుధవారం స్థానిక టీడీపీ నాయకులు హాస్టల్ వార్డెన్‌కు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పేద విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా స్వచ్ఛమైన నీటిని అందించాలని వాటర్ ప్యూరిఫైయర్‌ను అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి జ్యోతినాయుడు, శ్రీనివాసులు, శ్రీధర్, సలీం, ఆర్ముగం, అశోక్, సుబ్రహ్మణ్యం రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



నింద్ర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ చూపిన నగరి పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థులను పాఠశాల ప్రతినిధులు అభినందించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 100 మీటర్ల పోటీల్లో అండర్-14లో మన్, ప్రీతి, దీక్ష, జయవర్ధని, అండర్-17లో కృష్ణకౌశిక్, వాలీబాల్‌లో అండర్-14లో ఉదయ్‌కుమార్, లాంగ్‌జంప్‌లో దీక్ష, ఖోఖోలో లహరి, రక్షిత, మధుమిత, లక్ష్మి, నరసింహ, దీపక్‌లు విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఏటీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కార్తీక్, ఆర్ఐ కిరణ్, పాండియన్ పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డుపై మట్టి తొలగింపు



సిమెంట్‌రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరత్తూరు పంచాయతీ దళవాయి పల్లె దళితవాడకు వెళ్లేదారిలో సిమెంట్‌రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని బుధవారం టీడీపీ నేతలు తొలగించారు. దళితవాడకు వెళ్ళే సిమెంట్‌రోడ్డుపై వర్షం కురిసినపుడల్లా నీరు నిలిచిపోయి గత ఐదేళ్ళగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక టీడీపీనేతలు, దళితవాడ ప్రజలు జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రభుత్వవిప్ థామస్‌కు తెలియజేయగా.. ఆ సమస్యను పరిష్కరించాలని ధనంజయనాయుడిని ఆదేశించారు. ఈ మేరకు సొంతడబ్బుతో ఎక్స్‌కవేటర్‌తో సహాయంతో పాటు స్థానిక టీడీపీ నేతలు, దళితవాడ ప్రజలను సమన్వయం చేసుకుని బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సిమెంట్‌రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టితో పాటు పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. దీంతో దళితవాడ ప్రజలు ప్రభుత్వవిప్ థామస్‌కు, ధనంజయనాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రత్యేక గ్రీవెన్స్ డేలో సమస్యల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేలో 99 శాతం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అన్నారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆ శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన నాటి నుంచి చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలో 125 అర్జీలు రాగా, అందులో 112 పరిష్కరించామన్నారు. వినియోగదారులు, రైతులకు విద్యుత్ పరంగా ఏ సమస్య వచ్చినా ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఆశ్రయించవచ్చునన్నారు. కరెంట్ బిల్లులో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆయన సూచించారు. అనంతరం వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరి విద్యార్థి



తేజేష్

నింద్ర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరి పట్టణ పరిధిలోని సాయి వివేకానంద కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కె.సి.తేజేష్ ఎంపికయ్యాడు. అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 10వ అంతర్ జిల్లాల జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చిత్తూరు జిల్లానుంచి పాల్గొన్న తేజేష్ ప్రతిభకనబరచి జాతీయ జట్టుకు ఎంపిక కావడంతో పాటు స్టార్ ఆఫ్ ఆంధ్ర ధ్రువీకరణపత్రాన్ని పొందాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తేజేష్‌ని బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు అభినందించారు.

బీసీ భవన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించండి

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీసీ భవన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని చిత్తూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం కోరారు. బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను షణ్ముగం మర్యాదపూర్వకంగా కలసి సత్కరించి, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందించారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

పాలసముద్రం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో సతీష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నరసింహాపురం సచివాలయాన్ని ఆయన తనిఖీచేశారు. మండలంలోని కొన్ని సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో ఎంపీడీవో తనిఖీలు చేశారు.